క్లుప్తంగా

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలి



జిల్లా కలెక్టర్‌తో మాజీ ఎమ్మెల్యే శంబంగి, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు

బొబ్బిలి: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కోరారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొబ్బిలి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రామభద్రపురం: తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలలో ప్రతీ సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సులోచనరాణి, ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి సోమవారం ప్రజా వేదిక నిర్వహించారు. ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయా శాఖలకు పంపించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రాజాం: నిరుద్యోగ యువత సాంకేతికతను అందిపుచ్చుకొని స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు అన్నారు. గడిముడిదాంలో గ్రామానికి చెందిన యువరైతులు వరి వెదపంటలు నిమిత్తం ఏర్పాటుచేసిన డ్రోన్ స్ప్రేయర్లను సోమవారం ఆయన ప్రారంభించారు. వాటి వినియోగంపై గ్రామంలోని యువత శిక్షణ పొందాలని, ఇటువంటి సాంకేతిక పరికరాల వినియోగంపై యువరైతులు దృష్టి సారించాలని సూచించారు.

పిచ్చిమొక్కల తొలగింపు

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలోని ప్రధాన రహదారితో పాటు పీహెచ్‌సీకి, ఏపీ మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను సోమవారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరగిపోవడంతో నడవడానికి ఇబ్బందిపడాల్సి వస్తోందని పీహెచ్‌సీ, మోడల్ స్కూల్ ఉద్యోగులు గోపాలవలస సర్పంచ్ గొందాల వెంకటరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తాచెదాలను తొలగించారు.

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

తెర్లాం: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు అన్నారు. ఇటీవల కాలంలో మరమ్మతులకు గురైన బోరుబావులకు సోమవారం మరమ్మతులు చేయించారు. బోరుబావుల ద్వారా ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఘనంగా మారు రథయాత్ర

రాజాం సిటీ: స్థానిక బాబానగర్ సత్యసాయి బాబా శివం మందిరంలో నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం మారు రథయాత్ర నిర్వహించారు. జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. యాత్రలో వందలాది మంది భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు బొబ్బిలిలో..

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధిలోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మారు రథయాత్ర ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామివారు గుండిచా మందిరం నుంచి బయలుదేరి ప్రధాన ఆలయానికి చేరుకుంటారని అన్నారు.

ఉపాధి వేతనదారుల వినతి

రాజాం సిటీ: ఉపాధిహామీ వేతనాలు అందించాలని కోరుతూ కంచరాం గ్రామానికి చెందిన వేతనదారులు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మే 14 నుంచి జూన్ 7 వరకు చేసిన పనికి సంబంధించి ఇంతవరకు వేతనాలు చెల్లించలేదని వాపోయారు. వీలైనంత త్వరగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రెయ్యి రామకృష్ణ, శంకర్, ముత్యాలు, ధనలక్ష్మి కోరారు.

ఇంటి పన్ను వసూలు చేయండి

రాజాం: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా ఇంటి పన్ను బకాయిలపై ఆరాతీశారు. గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలు పూర్తిచేయాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడు బాబూ..?

- నియోజకవర్గంలో సుమారు 72,666 మంది నిరుద్యోగులు
- ఇంతవరకు విధివిధానాలు ప్రకటించని కూటమి సర్కారు
- ఎన్నికల ముందు ప్రతీ నెల రూ.3 వేల భృతి ఇస్తామన్న చంద్రబాబు

రాజాం:

అధికారంలోకి వస్తే లక్షల్లో ఉద్యోగాలు, చదువుకున్న ప్రతీ ఒక్కరికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామంటూ కూటమి నేతలు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు గడిచిపోయినా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది. నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి అమలు చేస్తారని యువత ఎందురుచూస్తోంది. రాజాం నియోజకవర్గంలో సుమారు 72,666 మంది వరకు నిరుద్యోగులు ఉన్నారు. వీరిలో అధిక శాతం మంది ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ కోర్సులు చేసిన వారే. చదువులు పూర్తయినా ఉద్యోగాలు లేకపోవడంతో చిన్నచిన్న పనులు చేసుకుంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి వస్తుందని భావించారు. నిరుద్యోగ భృతికి కనీస విద్యార్హత ప్రకటించకపోవడంతో పదో తరగతి పాసైన అభ్యర్థులు కూడా నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతవరకు దీనిపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో గతంలో మాదిరిగానే తామంతా మరోసారి మోసపోతామేమోనని భయపడుతున్నారు.



రాజాం నియోజకవర్గంలో నిరుద్యోగుల వివరాలు	
మండలం	నిరుద్యోగుల సంఖ్య
రాజాం	25,204
రేగిడి	19,306
సంతకవిటి	17,751
వంగర	10,405

గతంలో మాదిరిగా మోసం చేయొద్దు



ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం ప్రతీ నిరుద్యోగికి రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఎటువంటి నిబంధనలు ఇందులో పెట్టకుండా, పార్టీలకు అతీతంగా పథకం అమలుచేయాలి. నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్న యువతకు వచ్చే నెలనుంచే పథకాన్ని అమలుచేయాలి. ఇచ్చిన మాటను చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవాలి. గతంలో మాదరిగా మోసం చేయవద్దు.

– అలికాన బలరాం, డిగ్రీ, మారేడుబాక, రాజాం

నిరుద్యోగుల ఆశలతో ఆడుకోవద్దు



కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నిరుద్యోగ యువత నమ్మింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం తీరు మరోలా అనిపిస్తోంది. గతంలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి చంద్రబాబునాయుడు యువతను మోసగించారు. ఆ పరిస్థితి ఇప్పుడు వస్తే నిరుద్యోగ యువతను మోసం చేసి, వారి ఆశలను మంటగలిపినట్టే. అటువంటి పనిచేయొద్దు. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఈ ప్రభుత్వం వెంటనే ఇవ్వాలి. లేకుంటే నిరుద్యోగ యువత తరఫున ప్రభుత్వాన్ని నిలదీయకతప్పదు.

– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్

ఎదురుచూస్తున్నాం..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మాలాంటి నిరుద్యోగులు అందరికీ నిరుద్యోగ భృతి వస్తుందని ఎదురుచూస్తున్నాం. ఇంతవరకూ ఈ పథకానికి సంబంధించి ఎటువంటి ప్రకటన రాకపోవడంతో చాలామందిలో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి. పదోతరగతి చదువుకున్న నిరుద్యోగులను కూడా పరిగణలోకి తీసుకోవాలి.

– లావేటి దొరబాబు, డిగ్రీ, గడిముడిదాం, రాజాం మండలం

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



మానవహారం చేపడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పుణ్యవతి, అంగన్‌వాడీ టీచర్లు

రామభద్రపురం: మండలంలోని జీలికవలసలో ఆరు నెలల పసికందుపై పైశాచికత్వానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి అఘాయిత్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పుణ్యవతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం గాంధీబొమ్మ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక దాడి మానవ జాతికే కళంకమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బొబ్బిలి:రామభద్రపురం మండలంలో పసిగుడ్డుపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ కో కన్వీనర్ గర్భాపు రమేష్ డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకునే ఇటువంటి అకృత్యాలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులపై ఉందన్నారు. ఇటువంటి దురాఘతాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక రేపు

బొబ్బిలి: వచ్చే నెల 3, 4 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి మూడడ్ల గణేష్‌నాయుడు సోమవారం తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి ఈ నెల 17న బొబ్బిలి దాడితల్లి కాలనీలో ఉన్న శ్రీప్రఖ్యా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఉదయం 10 గంటలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అండర్ 7 విభాగంలో పాల్గొనేందుకు జనవరి 1, 2007 తరువాత పుట్టిన వారు అర్హులన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా పుట్టిన తేదీ ధృవపత్రాన్ని తీసుకురావాలన్నారు. ఓపెన్ కేటగిరీలో ఇద్దరు, బాలికల కేటగిరీలో ఇద్దరు చొప్పున రాష్ట్ర స్థాయి పోటీలకు సెలక్ట్ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 16న సాయంత్రం 5 గంటల లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9182337499 ను సంప్రదించాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

బొబ్బిలి రూరల్: మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలైన చినఅక్కేనవలస, చియాన్‌వలస, రామన్నవలస ప్రజలు తమ గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ త్రినాథరావునాయుడును కోరారు. ఈ మేరకు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, రహదారులు లేవని, పలుమార్లు అధికాలను కలిసి వినతులు అందించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలను వేయగా అటవీ శాఖాధికారులు అడ్డుకున్నారని, ఇదేమిటని అడిగితే ఎన్నికల కోడ్ కారణంగా చూపారన్నారు. ఎన్నికలు పూర్తయి నెలలు గడుస్తున్నా విద్యుత్‌శాఖ వారు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు వారికి హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు తమ సమస్యలు చెపుతున్న గిరిజనం

సామాజిక తనిఖీలకు సహకరించాలి

రామభద్రపురం: మండలంలోని 22 పంచాయతీల్లో నిర్వహించనున్న 18వ విడత సామాజిక తనిఖీలు సజావుగా జరిగేలా సహకరించాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్(ఎస్ఆర్‌పీ) కె.మన్మథరావు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సూపరింటెండెంట్ అక్కారావుతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఎఫ్ఏ, టీఏలతో సోమవారం సామాజిక తనిఖీలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ మాట్లాడుతూ.. మండలంలోని 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 మధ్య కాలంలో రూ.16.96 కోట్ల నిధులతో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు సామాజిక తనిఖీలు సజావుగా సాగేందుకు సహకారం అందించాలని కోరారు. గ్రామసభలు నిర్వహించే ముందురోజు ఆయా పంచాయతీల సర్పంచ్‌లకు సమాచారం అందించడంతో పాటు గ్రామంలో దండోరా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ రమేష్, ఏపీవో త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ మన్మథరావు

మహిళలపై లైంగిక వేధింపులు నిరోధించాలి

- ఆర్డీఓ సాయిశ్రీ

బొబ్బిలి: పనిప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నిరోధించాలని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ అన్నారు. బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలుపై సోమవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి చోటా ఇందుకోసం కమిటీలు ఉండాలన్నారు. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ హోంలు, పరిశ్రమలు, క్రీడా సంస్థలు, ఆస్పత్రులు, సహకార సంస్థలు, విద్యా సంస్థలు, కార్పొరేషన్, వివిధ ఉపాధి సంస్థలు, బ్యాంకుల్లో పనిచేసే మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టయితే ఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి నిందితులను శిక్షిస్తామన్నారు. శృంగార చేష్టలు, ద్వందార్థాలు, శరీరాలను తాకడం, సంభాషణలు చేసి ఆత్మగౌరవం దెబ్బతినేలా చేస్తే కఠిన చర్యలుంటాయన్నారు. సంఘటనలు జరిగిన నెలరోజుల లోపు బాధితులు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, సీడీపీఓ జె.విజయలక్ష్మి, కె.రాజ్యలక్ష్మి, నాగమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

పసికందుపై లైంగిక దాడి బాధాకరం

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: పసికందుపై లైంగిక దాడి బాధాకరమని, ఈ అఘాయిత్యానికి పాల్పడిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రామభద్రపురం మండలం జీలికవలసలో ఆరు నెలల పసిబిడ్డపై జరిగిన అత్యాచార ఘటన విని తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానన్నారు. సభ్య సమాజం తలదించుకునే ఘటనకు పాల్పడిన నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విధ్వంసాలు జరుగుతున్నాయని అనుకుంటే ఇలాంటి అరాచకాలు ప్రారంభమయ్యాని విమర్శించారు. ఇలాంటి అఘాయిత్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మా ప్రభుత్వంలో ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై దిశ, ఫోక్సో చట్టాల కింద కఠిన శిక్షణ అమలు చేశామని గుర్తుచేశారు. ఆయనతో పాటు బొబ్బిలి మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, వైఎస్సార్‌సీపీ నాయుకులు శర్మ, వర్రి శివుడు, చొక్కాపు లప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

రేగిడి: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముందుగా పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. గ్రామాల్లో యువత మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పీహెచ్‌సీ సిబ్బంది

సెల్‌టవర్ తొలగించండి

వంగర: ప్రజల ప్రాణాలను కబళిస్తున్న సెల్‌టవర్‌ను తక్షణమే తొలగించాలని కోరుతూ కొండచాకరాపల్లి గ్రామస్తులు గ్రామంలోని సెల్‌టవర్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సెల్ టవర్ రేడియేషన్ కారణంగా గ్రామంలో 20 మంది వరకు క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సెల్‌టవర్ తొలగించాలంటూ నినాదాలు చేశారు. వంగర ఎస్సై సూర్యనారాయణ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పడంతో వారు శాంతించారు. సమస్యపై తహసీల్దార్ చిరంజీవి పరాగ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సెల్‌టవర్‌ను తొలగించకపోతే ఉద్యమబాట పడతామని గ్రామస్తులు స్పష్టం చేశారు.



సెల్ టవర్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

దోమల నివారణకు చర్యలు



కొరటాంలో దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తెర్లాం: మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మండలంలోని కొరటాం, ఎస్.బూర్జవలస, చినపాలవలస తదితర గ్రామాల్లో సోమవారం కాలువల్లో పూడికలను తొలగించడంతో పాటు దోమల నివారణ మందును స్ప్రే చేశారు.

దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ సేవలు ఆదర్శం

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సాధనకు, సమాజాన్ని చైతన్యం చేసేందుకు ఆమె చేసిన కృషిని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

యూనిఫాం అందజేత

రాజాం: మండలంలోని గురవాం కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం యూనిఫాం దుస్తులు పంపిణీ చేశారు. స్టూడెంట్ కిట్స్‌లో భాగంగా ప్రతీ విద్యార్థినికి రెండు జతల యూనిఫాంలు అందించినట్లు ప్రిన్సిపాల్ సావిత్రి తెలిపారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 200 మంది విద్యార్థులకు వీటిని అందజేసినట్లు చెప్పారు. సీనియర్ ఉపాధ్యాయిని గోవిందమ్మ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కాలిబాటలతో బహుళ ప్రయోజనాలు

రేగిడి: రైతులు ఖరీఫ్ వరినాట్లు వేసిన వెంటనే పొలాల్లో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని రేగిడి, వండానపేట, చాటాయవలస తదితర గ్రామాల్లో వరి నాట్లు వేసిన పొలాలను సోమవారం పరిశీలించారు. కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కాలిబాటల వల్ల పంటకు గాలి, వెలుతురు సమృద్ధిగా అందుతాయని, ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు.

సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసుకోండి

రాజాం సిటీ: మున్సిపాలిటీ గుర్తించిన సెప్టిక్ వాహనదారులతో ట్యాంకులను నిర్ణీత రుసుం చెల్లించి శుభ్రం చేయించుకోవాలని కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సోమవారం వసతిగృహాలు, కళాశాలలు, పాఠశాలలు, లాడ్జీలు, గృహ సముదాయాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ వాహనదారులు వ్యర్థాలను ట్రీట్మెంట్ ప్లాంట్‌కు తరలించాలని, అలాకాకుండా ఆరుబయట అన్‌లోడ్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి విద్యాసంస్థ, వ్యాపార సంస్థలు డీస్లెడ్జింగ్ చేయించుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్, ఏఈ కె.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు నా వరకు తేవద్దు

- మండల స్థాయి అధికారులకు కలెక్టర్ ఆదేశం

బొబ్బిలి రూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు స్థానికంగా పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మండలంలో, పట్టణాల్లో ప్రజా సమస్యలను తనవరకు రాకుండా చూసుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు పరిష్కరించలేని సమస్యలైతే జిల్లా కేంద్రానికి పంపాలన్నారు. అనంతరం తహసీల్దార్ త్రినాథరావునాయుడు విలేకరులతో మాట్లాడుతూ.. తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు తమ అర్జీలను అందించాలని, ఇక్కడ పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టరేట్‌లో అర్జీలు అందజేయాలని కోరారు.

పశుగ్రాసం సాగుపై అవగాహన

తెర్లాం: పశుగ్రాసం ఏ విధంగా వినియోగించాలో రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా సోమవారం పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాలిచ్చే పశువులకు ప్రతిరోజు పచ్చగడ్డిని మేతగా వేయడం ద్వారా పాల దిగుబడి ఘననీయంగా పెరుగుతుందన్నారు. పశుగ్రాసం సాగుకు పశుసంవర్ధకశాఖ ద్వారా ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో నెమలాం పశువైద్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ, వెటర్నరీ అసిస్టెంట్ డి.తేజ, సచివాలయ పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి నరేంద్రకుమార్

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు రక్షించుకోండి



అంబేద్కర్ కూడలిలో చేపట్టిన మానవహారం

- సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి అనుకోని ప్రమాదాల నుంచి ప్రాణాలను రక్షించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో సోమవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక కోర్టు సముదాయం నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు పోలీసులు, వివిధ కళాశాలల విద్యార్థులు, న్యాయవాదులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయంలో ఎక్కువ మంది హెల్మెట్ లేకపోవడంతోనే మరణిస్తున్నారని అన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణాలకు ముప్పు కలిగించడంతోపాటు కుటుంబాన్ని వీధిన పడేస్తుందన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ఎదుటివారికి కూడా మేలు చేసిన వారమౌతామని అన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, ఎస్సైలు వై.రవికిరణ్, ఇ.శ్రీనివాస్, ఎస్.చంద్రశేఖర్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కె.రామినాయుడు, ఉపాధ్యక్షుడు ఆర్‌ఈ సీహెచ్ జయదేవ్, న్యాయవాదులు కె.రమణమూర్తి, వై.ఈశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మానవతా సంస్థ సభ్యులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.